

# హాస్య వల్లరి





## నెలనెలా నవ్వుల పండగ

## మల్లాది వెంకటకృష్ణమూర్తి స్పెషల్

**వయసులో ఉన్న** ఓ అమ్మాయి ఏ పెళ్ళికెళ్ళినా ఆమె బామ్మ , ఆమెవంక చూసి నవ్వుతూ "తర్వాత నువ్వే నువ్వే.." అనసాగింది.

అది ఆమెకి ఎంతో కోపాన్ని తెప్పించసాగింది. అలా అనవద్దని చెప్పినా బామ్మ వినడంలేదు.

ఓ రోజు ఎవరిదో చావుకి వెళ్ళిందా అమ్మాయి.

అక్కడున్న బామ్మని చూసి గట్టిగా చెప్పిందా అమ్మాయి..

"తర్వాత నువ్వే.. తర్వాత నువ్వే.."

ఆ తర్వాత పెళ్ళిళ్ళలో ఆ అమ్మాయిని చూసినా బామ్మ "తర్వాత నువ్వే" అనడం మానేసింది.

❀❀

చౌచౌ... ఏరుకొచ్చిన నవ్వులు

“ ఏమనుకున్నావో! నేను కాలేజీలో చదువుతున్న రోజుల్లో ఏ.వి. కాలేజీ హాకీ టీమంటే హడలెత్తిపోయేవారు అందరూ"

"అయితే నువ్వు చదివింది ఏ.వి కాలేజీలోనన్నమాట.”

"అబ్బే.. కాదు. సి.ఆర్. కాలేజీలో."

"మీరు కారు నేర్చుకోడానికి ఎంత సమయం పట్టింది?"

"నాలుగయిదు..."

"బాబోయ్! నాలుగైదురోజుల్లోనే నేర్చేసుకున్నారా? మార్వలెస్ అనుకోండి."

"రోజులు కాదు కార్లు."

ప్రేయసీ ప్రియులు పార్కులో కూర్చున్నారు. ప్రేమికుడు మొహమాటపడుతూ –

"రాధా! ఇంతకాలం నిన్ను ఓ అబద్ధం చెప్పి మోసగించాను" అన్నాడు.

"ఏమిటది?" గాభరాగా అడిగింది ప్రేయసి.

"నాకు ఇంతకుముందే పెళ్ళయింది" అన్నాడు మెల్లగా.

"అమ్మయ్య. అంతేనా! నన్ననవసరంగా గాభరా పెట్టావే. ఇంకా నయం. నీ పర్సులో డబ్బులు లేవమోనని హడలిపోయాను సుమా" అంది ప్రేయసి తేలిగ్గా.

సినీతార నటశ్రీకి తన వయసును తగ్గించి చెప్పడం అలవాటు. ఒకసారి ఆమె తన కూతురితో కలిసి ఓ పార్టీకి వెళ్ళింది. అక్కడ తన వయసును ఒక్కొక్కరికీ ఒక్కో విధంగా కొందరికి 20 అనీ, కొందరికి 25 అనీ, మరికొందరికి 22 అనీ చెప్పసాగింది.
ఉన్నట్టుండి కూతురు ఆమె చెయ్యిపట్టుకుని ఓ మూలకి లాక్కుపోయి "మమ్మీ నీ వయసూ ఎంతైనా తగ్గించి చెప్పు. కానీ నీ వయస్సుకూ నా వయస్సుకూ మధ్య కనీసం 9 నెలల తేడా అయినా ఉండనీ" అంది దీనంగా.

కొత్తగా ఇంగ్లీషు నేర్చుకోవడం మొదలుపెట్టిన అరుణ ఓ రోజు "డాక్టర్‌గారూ మీరు అర్జంటుగా రావాలి. మా మామయ్యగారు ఉన్నట్టుండి 'నాన్సెన్స్' అయిపోయారు" అంది కంగారు పడుతూ.
ఆమె చెప్పింది అర్థంకాక "మళ్ళీ చెప్పండి" అన్నాడు డాక్టర్.
"మామగారు ఇందాక భోజనం చేసినప్పుడు 'సెన్స్'లోనే ఉన్నారు. ఆ తరవాత పడక కుర్చీలో కూర్చుని గుండె చేత్తో రాసుకుంటూ 'నాన్‌సెన్స్' అయిపోయారు" అంది అరుణ.

"బేబీ నీ వయసు ఎంత?"
"పధ్నాలుగేళ్ళు"
"మీ అక్క వయస్సు?"
"పాతికేళ్ళు."
"మరి ఆమె తన వయస్సు ఇరవై ఏళ్ళేనని చెప్పుకుంటుందేం?"
"అవును. అయిదేళ్ళు నిండాకే కదా ఆమె లెక్కలు నేర్చుకున్నది."

"చూడండి పిల్లలూ! మీరంతా నిశ్శబ్దంగా ఉండాలి. క్లాసులో సూది పడేసినా వినిపించేటంత నిశ్శబ్దంగా ఉండాలి" అంది టీచర్.

వెంటనే పిల్లలంతా అల్లరి మానేసి నిశ్శబ్ధంగా కూర్చున్నారు. కొన్ని క్షణాల నిశ్శబ్దం తర్వాత ఓ కుర్రాడు ఇలా అన్నాడు –

"ఇప్పటికైనా ఆ సూది ఓసారి కింద పడెయ్యండి మేడం."

"రాజకీయనాయకుడు కావాలంటే కావలసిన ముఖ్యమైన అర్హతలేమిటి?" ఓ విలేఖరి చర్చిల్‌ని అడిగాడు.

చర్చిల్ జవాబు "అతనికి భవిష్యద్వాణి చెప్పగలిగే శక్తి ఉండాలి. రేపుగాని, వచ్చేనెలలోగాని, వచ్చే సంవత్సరంలోగాని ఏం జరగనున్నదో ముందే చెప్పగలగాలి. ఆ తర్వాత అవి ఎందుకు జరగలేదో కూడా వివరించగల సామర్ధ్యముండాలి."

"నీ చెప్పులు చాలా బావున్నాయి ఉమా" అంది స్నేహితురాలు.

"నేనెంతో పొదుపుచేసి కష్టపడి చెప్పులు కొన్నానులే"

"ఎలా పొదుపు చేశావంత డబ్బు?"

"మా ఆయనచేత సిగరెట్లు, సినిమాలు మానిపించి ఆ డబ్బుతో కొన్నానివి.."

"ప్రపంచంలో మోసగాళ్ళు ఎక్కువయిపోయారండీ"

"ఏమయింది?

"పొద్దున్న పాలవాడు చెల్లని రూపాయిచ్చిపోయాడు."

"పోన్లే వెధవ! వాడి పాపాన వాడే పోతాడు. ఆ రూపాయిటుతే,కూరగాయల మార్కెట్లో మార్చుకొస్తాను."

COMMENTS